క్లుప్తంగా

పిడుగు పడిన బాణసంచా కేంద్రం సందర్శన

ఉండ్రాజవరం: ఫస్ట్ ఎయిడ్ క్యాంపులో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని సూర్యారావుపాలెంలో పిడుగుపాటుకు బుధవారం దగ్ధమైన బాణసంచా తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫస్ట్ ఎయిడ్ శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ సుజన, ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే ఖాన్, పి.కల్యాణి, పద్మావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేవంలో నేత్రదానం


జమ్ముల వేణుగోపాలకృష్ణ

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన జమ్ముల వేణుగోపాలకృష్ణ (80) శుక్రవారం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు వేణుగోపాలకృష్ణ నేత్రాలను దానం చేశారు. మృతుడి కుమారుడు వెంకట్రాయచౌదరి, కుమార్తెలు ధనలక్ష్మి, సంధ్యారాణి అంగీకారం మేరకు ఆయన కార్నియాలను నిడదవోలు శ్రీ రాజరాజేశ్వరి లయన్స్ ఆసుపత్రి సిబ్బంది సేకరించి వెళ్లారు. వాటిని హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు పంపామన్నారు.

నేడు విద్యుత్ సరాఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి సబ్ స్టేషన్ పరిధిలోని కె.సావరం గ్రామానికి శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్టు ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శుక్రవారం తెలిపారు.

దీపం-2 పథకం ప్రారంభం

నిడదవోలు: దీపం- 2 పథకం కింద జిల్లాలో 5,29,070 మంది లబ్ధిదారులకు రూ.76.95 కోట్ల మేర ఆర్థిక లబ్ధి చేకూర్చనున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ చిన్న రాముడులతో కలిసి శుక్రవారం ఆయన దీపం- 2 పథకాన్ని ప్రారంభించారు. దీపం పథకం నమూనాలను అధికారులతో కలని మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి దుర్గేష్ ఓ మహిళకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేశారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టి.కృష్ణవేణి, తహసీల్దారు నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల స్థాయిలో దీపం -2 పథకాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. అనంతరం ప్రక్కిలంక గ్రామంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఎంపీడీవో టి.వెంకటరమణ, తహసీల్దార్ బి. రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: పట్టణంలోని శివరామ గ్యాస్ ఏజెన్సీ వద్ద దీపం-2 పథకం కింద లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆర్డీవో రాణి సుస్మిత, మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాల్దారిలో ధాన్యం కొనుగోలు కేంద్రం

ఉండ్రాజవరం: మండలంలోని కాల్దారి గ్రామ రైతు సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో కలసి శుక్రవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఎర్ర కాలువ ముంపు బాధిత రైతులకు వారం రోజుల్లో ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని మంత్రి దుర్గేష్ చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శేషారావుతో కలసి మంత్రి దుర్గేష్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము అంజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వి.రామారావు, ఏవో విశ్వాసరావు పాల్గొన్నారు.

బాల్యంలోనే లక్ష్యాలను ఎంచుకోవాలి

గోపాలపురం: పిల్లలు బాల్యంలోనే లక్ష్యాలను ఎంచుకొని విద్యాభ్యాసం కొనసాగించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైకాలజిస్టు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. మండలంలోని రాజంపాలెం జెడ్పీ హైస్కూల్, గోపాలపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో శుక్రవారం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సైకాలజిస్ట్ సుబ్బారావు మాట్లాడుతూ పిల్లల్లోని అంతర్గత శక్తిని ఉపయోగించుకోవాలంటే వారిలో మార్పు రావాలన్నారు. ఇబ్బందికర అలవాట్లు, దృక్పథాలు, ఆలోచనలను మార్చుకోవాలన్నారు. మానవత జిల్లా విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మానవత సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి ఆశయాలకు అనుగుణంగా సభ్యులు పని చేస్తున్నారన్నారు. వెలుగు ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి, జొన్నలగడ్డ రాంబాబు, మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు పప్పు సత్య కృష్ణారెడ్డి, రాపాక ఫణి కిషోర్, గెడ జోగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్నానఘట్టాలిలా.. పుణ్యస్నానాలెలా?

- నేటి నుంచి కార్తిక మాసం ప్రారంభం
- కొరవడిన కనీస వసతులు
- ఆదమరుపుగా నదిలోకి దిగితే ముప్పే


కొవ్వూరులో అధ్వానంగా ఉన్న సీతారామ స్నానఘట్టం


పరిశుభ్రత కొరవడిన కొవ్వూరులోని శ్రీకృష్ణ చైతన్య స్నానఘట్టం

కొవ్వూరు: పవిత్ర కార్తిక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుంది. నెల పొడవునా వేకువనే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే గోదావరి స్నాన ఘట్టాలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. కార్తికంలో నదీ స్నానాన్ని భక్తులు పరమ పవిత్రంగా భావిస్తారు. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా గోదావరి నది వెంబడి కొవ్వూరు, తాళ్లపూడి, పెరవలి, నిడదవోలు మండలాల్లో 30కి పైగా స్నాన ఘట్టాలున్నాయి. ఒక్క కొవ్వూరు గోష్పాద క్షేత్రం మినహా మిగిలిన స్నాన ఘట్టాల్లో వసతులు అరకొరగా ఉన్నాయి. ఏటా కార్తిక స్నానాలకు వెళ్లి అనేక మంది భక్తులు నదిలో గల్లంతై ప్రాణాలు కోల్పోతున్నారు. స్నానాలకు అనువుగా లేని స్నానఘట్టాలను తాత్కాలికంగా మూసివేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే స్థానిక గోష్పాద స్నానఘట్టంలో కూడా ఏటా ఏదో ఒక దుర్ఘటన సంభవిస్తూనే ఉంది. ఇక్కడి మెట్లపై నాచు పేరుకుపోవడంతో జారిపడి భక్తులు గాయపడుతున్నారు. కొవ్వూరు మున్సిపాలిటీ పరిధిలో పదికి పైగా స్నానఘట్టాలు ఉన్నాయి. గోష్పాద క్షేత్రం మినహా మిగతా అన్ని స్నానఘట్టాల మెట్లు ఇసుక మేటలు, చెత్త చెదారంతో అధ్వాన స్థితిలో ఉన్నాయి. గ్రామాల్లోని స్నానఘట్టాల్లో మౌలిక సదుపాయలు మెరుగు పరచాల్సి ఉంది. లైట్లు కూడా వెలగడం లేదు. నిర్వహణ కొరవడడంతో చెట్లు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం తాత్కాలిక ఏర్పాట్లు కూడా లేవు. మరోవైపు ఆగస్టులో వచ్చిన వరదలకు పలుచోట్ల స్నానఘట్టాలు కోతకు గురయ్యాయి. స్నానఘట్టాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు నిర్దిష్ట ప్రదేశంలోనే భక్తులు స్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకోకపోతే వారు ప్రమాదాల బారిన పడే ముప్పు ఉంది.

4న గోదావరి హారతి

కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా ఈనెల 4న టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గోష్పాద క్షేత్రంలో గోదావరి హారతి వేడుక నిర్వహిస్తారు. తిరుమల నుంచి తీసుకొచ్చే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు గోదావరి నది మధ్యలో ఏర్పాటు చేసే ప్రత్యేక పంటుపై కల్యాణం నిర్వహిస్తారు. ఈ వేడుకను తిలకించేందుకు ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి సుమారు 15 వేల మందికి పైగా భక్తులు హాజరవుతారు.


కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో నదీ స్నానాలు ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)

అధ్వానంగా గ్రామాల్లోని స్నానఘట్టాలు

నిర్వహణ లోపం వల్ల నదీ తీరం వెంబడి గ్రామీణ ప్రాంతాల్లోని స్నానఘట్టాలు అధ్వానంగా ఉన్నాయి. ఇసుక ర్యాంపుల వల్ల ప్రక్కిలంక, తాళ్లపూడి, వేగేశ్వరపురం, ఔరంగాబాద్, ఏరినమ్మ ఘాట్‌లు పాడయ్యాయి. భక్తులు స్నానాలకు కూడా ఈ ర్యాంపులు అనువుగా లేవు. కొవ్వూరు మండలంలో చిడిపి, కుమారదేవం, ఆరికిరేవుల, వాడపల్లి, బంగారమ్మపేట, సీతంపేట, మద్దూరుల్లో స్నాన ఘట్టాలున్నాయి. నిడదవోలు మండలంలో విజ్జేశ్వరం, పెండ్యాల, పందలపర్రు గ్రామాల్లోను, పెరవలి మండలంలో తీపర్రు, మల్లేశ్వరం గ్రామాల్లోనూ స్నానఘట్టాలున్నాయి. కానూరు అగ్రహారం, ఖండవల్లి, ఉసులుమర్రు, కాకరపర్రు గ్రామాలకు నదీపాయ దూరంగా ఉంటుంది. అయినప్పటికీ భక్తులు గోదావరిలో కార్తిక స్నానాలకు వెళుతుంటారు. ఈ అన్ని గ్రామాల స్నానఘట్టాల్లోనూ వసతులు మెరుగు పరచాల్సి ఉంది. వరద ఉధృతిని బట్టి అన్ని స్నానఘట్టాలూ కోత గురవుతుంటాయి. ఆయా స్నానఘట్టాలు భక్తుల స్నానాలకు అనువైనవో కాదో గజ ఈతగాళ్లతో నిర్ధారించిన తర్వాతే స్నానాలకు అనుమతించాలి. లేదంటే లోతు తెలియక భక్తులు ప్రమాదాల బారిన పడే ముప్పు ఉంది.

ఐదు రోజులు ప్రత్యేకం

గోష్పాద క్షేత్రానికి పురాణ ప్రాశస్త్యం ఉండడంతో ఈ నెలంతా వేలాదిగా భక్తులు ఇక్కడ స్నానాలకు వస్తుంటారు. కార్తిక సోమవారాలైన ఈ నెల 4,11, 18, 25 తేదీల్లో ఈ క్షేత్రానికి మరింత ఎక్కువ మంది భక్తులు స్నానాలకు వస్తారు. అలాగే కార్తిక పౌర్ణమి అయిన ఈనెల 15న కూడా ప్రత్యేక పూజల కోసం భారీగా భక్త జనం తరలి రానున్నారు. ఈ ఐదు ప్రత్యేక రోజుల్లోనూ అన్ని స్నానఘట్టాల్లోనూ ఏర్పాట్లపై అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది. వాడపల్లిలో ఎంపీపీ కాకర్ల నారాయుడు చొరవ తీసుకుని శుక్రవారం 30 మంది కూలీలను ఏర్పాటు చేసి స్నానాల రేవులను శుభ్రం చేయించారు. ముళ్ల పొదలు తొలగింప జేశారు. లైట్లు ఏర్పాటు చేయించారు. కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత, ఇతర అధికారులు గోష్పాద క్షేత్రంలో ఏర్పాట్లను గురువారం పరిశీలించారు.

ఇబ్బందులు కలగకుండా చర్యలు



కార్తిక మాసంలో నదీ స్నానాలు ఆచరించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలు, తహసీల్దార్లను ఆదేశించాం. గోష్పాద క్షేత్రానికి అధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మెట్లపై నాచు పట్టి జారుతున్నందున ఇసుక వేయించాం. ఇక్కడి మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయించాలని ఆదేశించాం. రెండు,మూడు రోజుల్లో ఇద్దరు వాచ్‌మన్‌లను కూడా ఏర్పాటు చేయిస్తాం.

–రాణి సుస్మిత, ఆర్డీవో, కొవ్వూరు

మొరాయించిన సర్వర్లు

పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు

దేవరపల్లి: మండలంలో ఉదయం 5.30 గంటలకు గ్రామ సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీ చేపట్టారు. 7.30 గంటల వరకూ పంపిణీ జరిగింది. తర్వాత ఆధార్ సర్వర్ లింక్ మొరాయించడంతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. లబ్ధిదారులు గ్రామ సచివాలయాల వద్ద పడిగాపులు పడ్డారు. సాయంత్రం 3 గంటల నుంచి సర్వర్ పని చేయడంతో పింఛన్ల పంపిణీ పునరుద్ధరించారు. తొలిరోజు మండలంలో 10,974 మంది లబ్ధిదారులకు గాను 10213 మందికి (93.07 శాతం) పంపిణీ జరిగింది. జిల్లాలో దేవరపల్లి మండలం చివరిస్థానంలో ఉంది. గోపాలపురం మండలంలో 94.17 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది.

తాళ్లపూడి: సర్వర్లు, సైట్ సక్రమంగా పని చేయక పోవడంతో మండలంలో తొలిరోజు శుక్రవారం పింఛన్ల పంపిణీ పూర్తిస్థాయిలో జరగలేదు. పెన్షన్లు కొంతమందికి అంది, మరి కొందరికి అందక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సర్వర్ పనిచేయలేదని సచివాలయ సిబ్బంది తెలిపారు. దీనిపై ఎంపీడీవో వెంకట రమణ మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకే 65 శాతం లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తిచేశామన్నారు.

నల్లజర్ల: శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సంబంధిత సర్వర్ మొరాయించడంతో వృద్ధులు కొన్ని గంటల సేపు వేచి ఉండాల్సి వచ్చింది. వివిధ గ్రామాల వృద్ధులు ఉదయాన్నే ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలకు చేరుకున్నారు. తీరా ఉదయం 10 గంటల నుంచే సర్వర్ మొరాయించడంతో వారంతా అక్కడే వేచి ఉన్నారు. భోజనాలు చేయకపోవడంతో వారంతా ఆకలితో అలమటించారు. మండలంలో 11,491 మందికి పెన్షలు ఇవ్వాల్సి ఉండగా సాయంత్రానికి 10,143 మందికి మాత్రమే అందించగలిగారు. 88.27 శాతం పెన్షన్‌లు పంపిణీ జరిగినట్టు ఎంపీడీఓ సింహాద్రి వెల్లడించారు.

దేవరపల్లిలో చురుగ్గా టౌన్ ఫీడర్ నిర్మాణం

రెండు నెలల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్యకు చెక్


దేవరపల్లిలో జరుగుతున్న రెండో టౌన్ ఫీడర్ నిర్మాణ పనులు

దేవరపల్లి: సుదీర్ఘకాలంగా దేవరపల్లి వాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. దాదాపు 16 వేల జనాభా గల గ్రామం నిత్యం విద్యుత్ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కొద్దిపాటి గాలులు వీస్తేనే గ్రామంలో గంటల కొద్దీ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో వినియోగదారులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కాదు. ఈ సమస్య ఇప్పటిది కాదు . మూడు దశాబ్దాలుగా ఉంది. గ్రామం అంతా ఒకే టౌన్ ఫీడర్‌పై ఉండడం, విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండడంతో తరచూ ఓవర్ లోడ్ సమస్య ఏర్పడి లో ఓల్టేజీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటోంది. సమస్య పరిష్కారానికి అధికారులు దాదాపు ఏడాదిగా ప్రయత్నాలు చేపట్టారు. ఆర్‌డీఎస్‌ఎస్‌లో రెండో టౌన్ ఫీడర్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో స్థానిక 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి రామన్నపాలెం రోడ్డు వరకూ రెండవ టౌన్‌ఫీడర్ నిర్మాణ పనులు చేపట్టారు. మూడు రోజులుగా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 12.5 మీటర్ల ఎత్తు గల విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే గ్రామంలోని విద్యుత్ సర్వీసులను రెండు ఫీడర్లుగా విభజించా సరఫరా చేస్తారు. దీనివల్ల ఓవర్ లోడ్, లోఓల్టేజీ సమస్య పరిష్కారం కానుంది. ఈ పనులు పూర్తికాగానే గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యపై దృష్టి పెడతామని ట్రాన్స్‌కో ఏఈ చిలకా వెంకట్రావు తెలిపారు. రెండు నెలల ప్రణాళికతో సమస్య పరిష్కారానికి ముందుకు వెళుతున్నట్టు ఆయన తెలిపారు.

రేపు ఏకాదశ సహస్ర గళార్చన

ఉండ్రాజవరం: స్థానిక సుంకవల్లి పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఏకాదశ సహస్ర గళార్చన-హనుమాన్ చాలీసా నిర్వహిస్తున్నారు. పెరవలికి చెందిన హిందూ ధర్మ పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 1,008 మంది చిన్నారులతో 11 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో 33 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు.

వేగంగా పురాతన ఆలయాల పునర్నిర్మాణం


దుద్దుకూరులో నిర్మాణంలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం


నిర్మాణంలో ఉన్న రామాలయం

ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతున్న దుద్దుకూరు

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతోంది. కొత్త ఆలయాల నిర్మాణం, జీర్ణావస్థకు చేరుకున్న పురాతన ఆలయాల పునఃనిర్మాణాలకు దాతలు విరాళాలు అందజేసి తోడ్పాటు అందిస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన సీతారామ చంద్ర స్వామి వారి ఆలయం, ఊర చెరువు గట్టున గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఉమా రామలింగేశ్వర స్వామి గణపతిస్వామి వారి ఆలయాలు జీర్ణావస్థకు చేరుకున్నాయి. ఆలయాల పునఃనిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శివాలయం, గణపతి ఆలయాల నిర్మాణాలను కోటప్పకొండ నుంచి తీసుకు వచ్చిన రాతితో చేస్తున్నారు. నైపుణ్యం గల శిల్పులతో ఆలయాలను సుందరంగా నిర్మాణం చేస్తున్నారు. ఆలయాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో రామాలయం, రూ. 2.20 కోట్ల అంచనా వ్యయంతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శివాలయం, గణపతి స్వామి వార్ల ఆలయాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం నిర్మాణానికి వినియోగించిన రాతిని ఇక్కడ ఆలయాల నిర్మాణానికి వినియోగిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నిడదవోలు: పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల సంఘం (సీఐటీయూ) చర్చిపేట పెయింటర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఇసుక ర్యాంపులు తెరిచి, ఇసుక సరఫరాను పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో వారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్స్,ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్స్ వంటి కార్మికులకు పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు కార్యక్రమంలో తాపీ పనివార్ల సంఘం అధ్యక్షుడు కారింకి వెంకటేశ్వరరావు, షేక్ జిలాని, దానమాల రాజు, పెయింటర్స్ యూనియన్ నాయకులు పెండెం చినబాబు, ఉసురుమర్తి ప్రభాకర్, మర్రిపూడి అశోక్, రాజేష్, జి.తిరుపతిరావు, దాకే సతీష్, లక్ష్మణరావు, తలారి బాబు, పోలుమాటి రాజశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి కాలువకు గండి


అత్తిలి కాలువకు పడిన గండి


గండి పూడ్చిన తర్వాత

నిడదవోలు: అత్తిలి కాలువకు గురువారం గండి పడింది. నిడదవోలు మండలంలోని సెట్టిపేట, ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామాల మధ్య ఈ గండి పడింది. దాంతో కొన్ని క్యూసెక్కుల గోదావరి జలాలు పంట బోదెల గుండా వృథాగా దిగువకు పోయాయి. పలువురు రైతులు అత్తిలి కాలువ గట్ల వెంబడి మినప మొక్కలు పెంచుతున్నారు. కొన్నిచోట్ల లూజు మట్టి ఉండడంతో కాలువ గట్లు బలహీన పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నీటి విడుదలను పెంచడంతో అత్తిలి కాలువ గట్టుకు గండి పడింది. ఈ కాలువ ద్వారా 75 ఎకరాల ఆయకట్టుకు ఏటా రెండు పంటలకు నీటిని అందిస్తున్నారు. కాలువ గట్లు బలహీనపడుతున్నాయని పలుమార్లు తాము ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసు వచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, నిడదవోలు తహసీల్దారు బి. నాగరాజు నాయక్‌లు గురువారం గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ముందుగా అత్తిలి కాలువకు అడుగు మేర నీటిమట్టం తగ్గించి నీటి ప్రవాహన్ని నియంత్రించారు. కర్రలను అడ్డుగా పెట్టి బస్తాలు పేర్చి మట్టితో గండి పూడ్చారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు అశ్రిత


అశ్రితతో ఉపాధ్యాయులు

గోపాలపురం: స్కూల్ గేమ్స్ అండర్-14 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని వాదాలకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.అశ్రిత ఎంపికైంది. గత నెల 25, 26, 27 తేదీల్లో అన్నమయ్య జిల్లా హిందూపూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ జట్టు ఎంపిక పోటీల్లో అశ్రిత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి, విశేష ప్రతిభ కనబరిచింది. దాంతో త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు అశ్రితను ఎంపిక చేసినట్టు వాదాలకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె .విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు బాలికలు


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం చెరుకూరి పద్మ

నిడదవోలు: స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఇద్దరు ఎంపికయ్యారు. అండర్-17 విభాగానికి ఈ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కారింకి జ్యోతి, అండర్-14 విభాగానికి ఏడో తరగతి విద్యార్థిని టెక్కలి దీపిక ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెలలో ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి యోగా ఎంపిక పోటీలలో వారిద్దరూ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. శనివారం నెల్లూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వారిద్దరూ పాల్గొంటారని హెచ్‌ఎం చెరుకూరి పద్మ, పీఈటీ శాంతి తెలిపారు.

గోదావరి హారతి పోస్టర్ ఆవిష్కరణ

కొవ్వూరు: ఈ నెల 4వ తేదీ సాయంత్రం స్థానిక గోష్పాద క్షేత్రంలో నిర్వహించే గోదావరి హారతి వేడుకకు తరలి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదేశించారు. గోదావరి హారతి పోస్టర్‌ను శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నాయకులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం గోష్పాద క్షేత్రానికి వెళ్లి అక్కడి వసతులు, సమస్యల గురించి ఇక్కడి ఆలయ నిర్వాహకులను, భక్తులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రం అంతా తిరిగి భవిష్యత్తులో ఇక్కడ చేపట్టాల్సి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో రాణి సుస్మిత, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం, బీజేపీ నాయకులు వెంట ఉన్నారు.

ఆక్రమణల్లో ప్రధాన రహదారి

- రోడ్డు మార్జిన్లలో వ్యాపారాలు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- వాగు పూడ్చేసి దుకాణాల నిర్మాణం
- పట్టించుకోని సంబంధిత అధికారులు


దేవరపల్లిలో ఆక్రమణకు గురైన గుండుగొలను-కొవ్వూరు ప్రధాన రహదారి

దేవరపల్లి: గుండుగొలను-కొవ్వూరు ప్రధాన రహదారి దేవరపల్లిలో ఆక్రమణలకు గురవుతోంది. స్థానిక ఇసుక వాగు వంతెన వద్ద నుంచి పోలీస్ స్టేషన్, మూడు రోడ్ల కూడలి జంక్షన్ నుంచి పొగాకు బోర్డు వరకూ ప్రధాన రహదారి కొంతకాలంగా ఆక్రమణలకు గురవుతూ వస్తోందని ప్రజలు వాపోతున్నారు. రహదారి పక్కనే గల వాగును పూడ్చేసి పక్కా భవనాలు నిర్మించి దుకాణాలు ఏర్పాటు చేశారు. గతేడాది ప్రధాన రహదారిపై సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకూ రహదారికి ఇరువైపులా వాహనాలను దుకాణాల వద్ద పార్కింగ్ చేయడంతో ప్రజల రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. దీంతో నిత్యం రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి పక్కనే గల వాగును పూర్తిగా మూసి వేయడంతో వర్షాకాలంలో ఇసుక వాగు నీరు వెళ్లే మార్గం లేక ప్రధాన రహదారిపై నీరు పొంగి ఇళ్లల్లోకి చేరుతోంది.ఈ ఏడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు వర్షపునీరు ప్రధాన రహదారిపై మూడు అడుగుల ఎత్తున ప్రవహించింది. ఆ సమయంలో వాగును పరిశీలించిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు ఆక్రమణల గురించి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రాజు ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇది జరిగి దాదాపు మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకూ పట్టించుకున్న నాథుడు లేడు. అక్టోబరు 2న గ్రామ పంచాయతీ వద్ద జరిగిన గ్రామ సభలో ఆక్రమణల తొలగించి ప్రమాదాలను నివారించాలని పలువురు గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వాగు, రహదారి ఆక్రమణలను తొలగించి ప్రమాధాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.